ఆంధ్రప్రభ వీక్లీ, దీపావళి 1968

వైడోంట్యూ మేరీమీ?

"వైడోంట్యూ మేరీమి, సుబ్రావ్?" అని మాట ఇరవై ఒకటో సారి కూడా అతి తియ్యగా అడిగింది కమ్లా మేనోన్. అదెందుకో వెగటుగా వినిపించింది సుబ్బారావుకి, ఇంటిదగ్గిర నించి వచ్చిన ఉత్తరం తపీమని నేలకేసి కొట్టేడు,

ఆ విసురు నామీద కాదులే నాకు తెలుసు" నన్నట్టుగా కమ్లా మేనోన్ ఒళ్ళంతా కదుపుతూ గుమగుమమని నవ్వేసింది, ఆ క్షణంలో సుబ్బారావుమీద ఆ బాధ్యత పడ్డాది.

తను ఉత్తరం నేలకేసికొట్టడం ఆమెమీద విసుక్కోడం అనుకుంటూందేమోనని మొహంమీద చిరునవ్వు పోసుకొని, "ప్లీజ్. ఒక్క నిమిషం కూచో, రేడియో పెట్టుకో కావాలంటే?" అని చెప్పేసి లోపలికి వెళ్ళేడు.

బాగానే ఉంటుంది, కమ్లా మేనోన్ .... మలయాళది.... "ఆడదీ మలయాళదీ — బహూ కళలు తెలిసిన జాణదీ?" .... కట్టినట్టు కట్టుకట్టకుండా, పెట్టినట్టు బొట్టు పెట్టకుండా, చుట్టినట్టు జుట్టు ముడి చుట్టకుండా ఆఖరికి అల్లరేనా సరే చేసిన పద్ధతిలో రెండో మాటు చెయ్యకుండా చలాకిగా తిరిగేస్తూ ఉంటుంది.

వై డోంట్యూ మేరీ మీ — వైడోంట్యూ - మి-?" అమ్మ బాబోయ్.

క్రమంగా ఈమధ్య "నన్నే పెళ్ళాడవోయ్. నరసింహా;"అని పాడినట్టు దండయాత్ర ప్రారంభించినా, మొదట్లో "వాట్ సుబ్రావ్, యువార్ ట్వెంటీ నైన్ - వైడోంట్యు మేరీ సమ్బడీ" అనే అడిగేది.

ఇరవైతొమ్మిదేళ్ళు మీదపడ్డ ప్రతిమొగాడ్ని "నువ్వింకా పెళ్ళాడవేమో" అని నిలదీసి అడిగేసే అంతంతపెద్ద ఆడవాళ్ళు కలకత్తాలోనేకాదు. రాతెనాడలోను కావసినంతమంది కనబడతారు.

అయితే ఆ ప్రశ్న అందమైన భూమికతో ముస్తాబై వస్తుంది

ఇంత చేసిందదు, ఉగాది పచ్చడిలో ఉన్నట్టు తగుమాత్రం వగరూ తీపీటూనా ఉంటాయి. అందులోనించి తగిన పంసోక్తి పుడుతుంది. "అయ్యో! ఇప్పటిదాకా పెళ్ళిచేసుకోకుండా పెళ్ళికాకుండా ఉండిపోయానే, దుఃఖం, విసుగూ, వెంగా మరిచిపోవడానికి అందులో చిన్న చిన్న హోమియోపతీ మాత్రలంతేసి హాస్యం డోసు ఉంటాయి. కాని ఈ మలయాళది - బేకర్ అండ్ బేకర్ కంపెనీవారి అసిస్టెంటు సెక్రెటరీ - కాలికట్లో పుట్టి కలకత్తాలో పెరుగుతున్న - కాదు పెరిగిపోతున్న ఈ కమ్లా మేనోన్ మాటలకి కాకినాడ కలకంఠుల మాటలోని కమ్మదనం ఎలా వస్తుంది! రెండేళ్ళకిందట ఆమె నోటింట ఆ ప్రశ్న ఎంత వెగటు కలిగించిందో ఇప్పుడూ అంత వెగటూ కలిగిస్తూనేవుంది. ఆ మాట దానితో చెప్పేస్తే బావుణ్ణనిపిస్తుంది. కాని..

ప్రెషర్ స్టవ్ వెలిగించి నీళ్ళు పడేశాడు సుబ్బారావు. కాళ్ళూ చేతులూ కడిగేసుకొని మళ్ళీ గదిలోకి వచ్చేటప్పటికి కమ్లా మేనోన్ చక్కగా మంచం మీద తలగడా నిలువుగా పెట్టుకొని సుఖంగా పడుకొని న్యూస్ పేపర్ చదువుకుంటున్నాది. తన అలికిడికాగానే "ప్లీజ్ — ఐ డోంట్ వాంట్ దట్ రెచ్చెడ్ టీ, మిస్టర్ సుబ్రావ్" అన్నాది ముద్దుగా.

కమ్లా మేనోన్ ముద్దుగా మాట్లాడినాకూడా సుబ్బారావుకి ఎబ్బెట్టుగా వినిపిస్తుంది.

"సుబ్రావ్" అంటుంది. "సుబ్బారావూ?" అనమంటాడు. "స్రావ్ అంటుంది. అతను నోరుమూసుకుని నమస్కారం పెట్టేస్తాడు. తనని "కమలా మేనన్" అనద్దు, "కమ్లా మేనోన్" అనమంటుంది, "కమ్లా" అనమంటుంది. అట్టే మాటాడితే "కొమ్లా" అనమంటుంది కూడాను.

"నేనేమీ చిన్నపిల్లవాణ్ని కాదు, కమ్లా, ఏమిటా ముద్దు పేర్లు పెట్టి పిలవ వాలు!" అన్నాడతనోసారి. "ముప్పయేళ్ళు నెత్తి మీదికి వచ్చి ఐదడుగుల తొమ్మిదంగుళాలు పొడుగూ, పద్దెనిమిదంచీల వెడల్పూ కలిగి నెలకి ఎనిమిది వందలు జీతం తెస్తున్న నిన్ను చూసి చిన్నపిల్లడనుకుందికి నేనేమైనా పూతన ననుకున్నావుటయ్యా." అంది

"టీ కాదు. కాఫీయే పెట్టుకుందాం, అన్నాడు సుబ్బారావు.

"కాఫియ్యే పెట్టూకుందాం" అని వెక్కిరించి మళ్ళీ ఒళ్ళంతా కదుపుతూ గుసగుసమని నవ్వుకుంది కమ్లా.

"నీ కెన్నిసార్లు చెప్పాలి రోడ్లన్నీ తిరిగి వచ్చిన వాళ్ళతోటి మంచ మెక్కి కూచోవద్దే తల్లి అని. అని మనసులోనే అనుకున్నాడు సుబ్బారావు, మర్యాదగా దగ్గిరికివెళ్ళి "ప్లీజ్, ఒక్కసారిలే. దుప్పటీ మారుద్దామనుకున్నా నుగాని బద్దకించేశాను నిన్నటి నించీనూ, ఏముంది బ్రహ్మచారి జీవితం" అని ముక్కలు ముక్కలు చేసి అన్నాడు నవ్వుతూ.

"హ్హా హ్హా హ్హా ది క్వెశ్చన్ అండ్ ది అన్సర్!" అంటూ మళ్ళ నవ్వింది కమ్లా.

ఇదింతే!

దీని దృష్టి నామీ దెప్పుడు పడ్డాదో అప్పుడే నాపని అయిపోయింది అని నిరుత్సాహపడ్డాడు తను. మొట్టమొదటిసారి ఈమెని నారాయణ గోస్వామి ఇంట్రడ్యూస్ చేసినప్పుడు అసిస్టెంటు సెక్రటరీ కదా. కొత్తగా క్లర్కో టైపిస్టో కాదుకాదా, మాట్లాడితే తప్పేముటని తనే చొరవగా ఉన్నాడు. అదే ఆకర్షణకి పూసుకొన్నట్లయింది. రోజూ కలుసుకోవడం, మాట్లాడుకోడం అలవాటయ్యేసరికి ఆమె రెండుమూడు రోజులు కనబడీమాట్లాడలేకపోతే గిల గిల్లాడిపోయాడు. ఆ రోజు రాత్రి సెకండ్ షో సినిమానించి టాక్సి దొరక్క అవస్థ పడుతున్న ఆమెని తను దయతలచి తన టాక్సీలో డ్రాప్ చెయ్యక పోతే ఈ కథ ఇంత దూరం రాకనేపోను. నాలుగోరోజునించీ "పోవోయ్, నీ సెక్షన్ వేరూ. నాది వేరూ." అని వేరుగానే ఉండి పోయేవాడు.

ఇప్పుడు ఎన్ని అలవాటయిపోయాయని ఇళ్ళకి పిల్చుకోవాలూ. కాఫీలి వ్వడాలూ, అందరికీ ఇంట్రడ్యూస్ చేసుకోడాలూ, పబ్లిసిటీ కాంపెన్‌లా కలసి తిరగడాలూ. చివరికి రాత్రి అయిపోతే ఒకళ్ళ నొకళ్ళు ఇళ్ళకి దిగబెట్టుకో డాలూనూ! ఇంతవరకూ వచ్చింది కదా, ఇది ఇంకెంతవరకూ రాకపోతుందా అని కమలామేనోన్ అంచనా .... ఏమిటో ....

"ఉత్తరం ఎవరు రాశారు, సుబ్రావు!" అని కట్టుకున్న పెళ్ళాం కంటే చొరవగా అడిగేసింది కమలామేనోన్. కాఫీ సుతారంగా సిప్‌చేస్తూ.

"ఎవరోలే...."

"మా అమ్మా, నాన్న ఉత్తరం రాసేరు. అందులో నేననుకున్నది ఏమి లేదు" అన్న ఆశాభంగాన్ని మొహంలో తెలియనివ్వకుండా చెయ్యాలని సుబ్బారావుపడ్డ తాపత్రయం అంతా వృథా అయిపోయింది.

"డబ్బు పంపమని రాస్తే నీకింత కోపం రాదే!"

క్రమంగా ఈ కమలామేనోన్ తన స్వంత సమస్య లన్నిట్లోనూ దూరి పోతున్నాది. డబ్బు పంపమని రాస్తే కోపం రాదని తెలిసిపోయింది. దీని కన్నీ తెలిసిపోతున్నాయి.

అవును. అక్కణ్ణించి వచ్చే ఉత్తరాలుకూడా అలాగే వుంటాయి.... నెల మధ్యని అసలు ఉత్తరాలే రావు. నెలాఖర్నే వస్తాయి. ఇక రెండు మూడు రోజులలో జీతాలు అందుతాయనగా వస్తుంది ఉత్తరం.

అలాటి ఉత్తరాలు నలభయికి దాటి వచ్చాయి ఇక్కడికి. అవన్నీ ఒక్కలాగే ఉంటాయి. వాట్లో సంగతులన్నీ మూసపోసిన సీసపుదిమ్మల్లా ఒకటిగానే వుంటాయి.

నెలాఖర్న ఇంటిదగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందంటే అది విప్పిచూసు కోవడం అనవసరం అని చెప్పవచ్చు. అసలు కొన్ని ఉత్తరాలు విప్పేవి రానే రావు. కార్డులే వస్తాయి.

"కార్డులు రాయకండి నాన్న" అంటే "పిచ్చివాడా! ఇక్కడ తెలుగు వచ్చినవాళ్ళ కంటబడకుండా ఎర్రడబ్బీలో స్వయంగా నేనే వేస్తున్నాను కదురా! అక్కడ అంతేనుంది బెంగాలీవాళ్ళ మధ్య నీ ఉత్తరం ఎవడికొక్కావాలిరా! అందుకే కార్డే పంపిచేరా, ఆ మాత్రం దానికి కవరుకూడా ఎందుకు అదో వండుగ? అందులో ఏమిటుందోనని ఎవరేనా చింపి చూస్తారు కూడానూ!" అని పొదుపు ఉద్యమం ఏజెంటులాగ మాట్లాడతాడు. "ఇంతకీ అందులో ఏమంత రహస్యమైన భోగట్టా లుంటాయి గనక!" అంటాడు.

అవును. రహస్యాలుండవు,

అవసరేమీ ఉండవు వాటిల్లో.

అంతా బాగున్నాం అని మొదలుపెట్టి ఎవరూ కులాసాగాలేం అన్నట్లు తేలుస్తాడు ఆఖరికి. "నా వంట్లో ఈ మధ్య అంత ఇదిగా ఉండడంలేదు. దగ్గు తెరలు తెరలుగా వస్తున్నాది. మీ అమ్మకి బ్లడ్ ప్రెషర్ ఎటాక్ ఈనెల్లో రెండుసార్లు వచ్చింది. చిన్నిగాడు మొన్న ఫుట్ బాలాడుతూ పడ్డాడు. మోచేతి మీదమీద చెక్కుకుని పెద్దపుండు అయిపోయింది. చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళి సంబంధాలు చూస్తూనే ఉన్నాం. ఈ నెల్లో ముగ్గురు పెళ్ళికొడుకులు వసంతని చూడ్డానికి వచ్చేరు. ముగ్గురికీ అది నచ్చినట్టేగాని, అందులో ఒకరి అంతస్తుకేనా

మనం తూగేటట్టు లేము." ఇలాగెలాగో ఉంటాయి ఆ క్షేమసమాచారాలు. చివరి వాక్యం మాత్రం డబ్బు ఎంత పంపాలో స్పష్టంగా రాసి వుంటుంది. ఎంత వేగిరం పంపితే అంత మంచిదని ప్రాధేయపూర్వకంగా ఆజ్ఞాపిస్తారు.

ఇరవైఆరోయేట కలకత్తాలో అడుగుపెట్టేడు తను. ఈ ఉద్యోగం కోసం. కాకినాడలో ఉన్నంతకాలం ఎక్కడా ఆఖరికి స్టేట్ గవర్నమెంటులో కూడా ఉద్యోగం దొరకలేదు. దొరికి ఉంటే అక్కడే వాళ్ళతోబాటు ఉండిపోయేవాడు, ఈ ఉత్తరాల బాధ, ఈ దిక్కుమాలిన వాడిలా ఉండడం బాధ. ఈ కములా మేనోస్ పరామర్శ బాధ తప్పిపోయేది. ఎక్కడో ఎవతెనో చూసి తనూ కట్టుకునేవాడు. చెల్లెళ్ళకి దక్షతగా చేసేవాడుకూడానూ.

ఇప్పటినుంచీ తొందరేమిటని అప్పటివరకూ తనే నిర్లక్ష్యం చేసేడు పెళ్ళి సంగతి.

ఇప్పుడు సంగతంతా వేరుగావుంది.

ఇప్పుడు తనెలా ఉన్నాడో, వేళకి అన్నమేనా తింటున్నాడో లేదో, బట్టలెవరు అందిస్తున్నారో, పక్కెవరు వేస్తున్నారో; తలనొప్పి వస్తే అమృతాంజనము ఎవర్రాస్తున్నారో, కష్టం సుఖం కలిగిన్నాడు ఎవరితో పంచుకుంటున్నాడో, అందమైన ఈ నగరంలో తిరిగినప్పుడు సుందరమైన దృశ్యం ఏదేనా కనబడి తనలో విపరీతమైన భావోద్వేగం కలిగినప్పుడు దానికి బయటికి వెళ్ళే మార్గం ఎవరు చూపిస్తున్నారో—ఇవేవీ తనవాళ్ళు పలకరించి పరామర్శించరు. అసలు ఇంటికి వెళ్ళి రెండేళ్ళయింది.

నిజమే! రెండేళ్ళకిందట ఇంటికి వెళ్ళినప్పుడు తల్లి నాలుగైదుసార్లు హెచ్చరించింది. "అబ్బాయీ, ఓ నెల్లాళ్ళు సెలవు పొడిగించు నాయనా, సంబంధాలు దొరుకుతాయి. నెల్లాళ్ళలో ముహూర్తాలు కుదురుతాయి. ఏకంగా కోడల్ని వెంటబెట్టుకునే వెళ్ళిపోదువుగాని" అంటూనూ. తల్లిమాట నిజంగా నిజమే. కుదిరిపోయేది, జరిగిపోయేదీ కూడానూ.

ఆవేళ రాత్రి సినిమాకి వెళ్ళడంతో వచ్చింది పొరపాటు. మరునాడు పిఠాపురం వెళ్ళి శ్రీధర్రావు చెల్లెలు పద్మజని చూడాలని, "మీచెల్లెల్ని నాకిచ్చి పెళ్ళి చెయ్యవోయ్" అని శ్రీధర్రావు నడగాలని, "నన్ను చేసుకో. పద్మజా!" అని ఆమె నడగాలని తియ్యగా, రహస్యంగా ప్రోగ్రాం వేసుకున్నాడు. ఆ ఉత్సాహంలో అలా అలా నాలుగు వీధులూ తిరిగి అక్కణ్ణించి సినిమాకి వెళితే....

తన పక్కసీట్లోనే పద్మజ. "ఎంతో సంతోషంగా ఉంది, నిన్నివాళ ఇక్కడ చూసినందుకు." అని పలకరించింది. తనకి కూడా ఆ నిమిషంలో సగంసేపూ అలాగే అనిపించింది. తరువాతి వాక్యంలో అగ్నిపర్వతాలు పేలి లావా నెత్తిమీద ప్రవహించింది. "ఇటు చూసేవా, ఈయన విద్యాసాగర్, ఎం. ఏ, ఇక్కడే లెక్చరర్. మా శ్రీవారు. మా స్నేహం వయస్సు ఇవ్వాళ్టికి నలభయి ఒకటో రోజు, మీరిద్దరూ కలుసుకోండి" అంటూ అందంగా నిండుగా నవ్వి ఇద్దరి చేతులూ కలిపింది. నలభయి ఒకటో రోజుకే రోజులు లెక్క పెట్ట డందాకా వచ్చిందా అన్న జోకు తన నోట్లోనుంచి ఇంకా ఇవతలికి రాలేదు. తెల్లటి సినిమాస్కోపు తెర నల్లగా పైన కంఫర్టబుల్‌గా వెలుగుతున్న డిమ్‌లైటు నల్లగా, పక్కన హార్పుని అంటంగా నవ్వుతున్న పద్మజ పలువరస నల్లగా, అంతులేని భవిష్యత్తంతా నల్లగా తననిచూసి వెక్కిరిస్తున్నట్టయింది. ఈ అప స్తుతికి విరుగుడేమిటో చప్పున అర్థంకాలేదు. అంతే, ఇంక పిఠాపురంలేదు. పిల్లలమర్రీలేదు. మరునాడే మెడ్రాస్ మెయిల్ ఎక్కేశాడు తను.

తనని ఇప్పుడు కమలామనోష్ తప్ప ఎవరూ అడగరు. "వై డోంట్యు మేరీ ఏ బ్యూటిఫుల్ లేడీ" అని. ఈ కమలా మేనోన్—ఇది నవ్వుతుంది, పలకరిస్తుంది, హాస్యమాడుతుంది....బజార్లకీ, బట్టలకొట్లకీ; సినిమాలకీ, చిల్లర షికార్లకి వస్తుంది. కాని దీనిలో ఏమేనా శృంగారం, సౌకుమార్యం ఉన్నాయా? ఇది వంట వండగలదా? పప్పుతిమ్మక్కలా మంచం మీద బాసింపట్టు వేసు కూచుని తను కాఫీచేసి ఇస్తే సుతారంగా సగందాకా తాగగలదు, ఆ మిగిలిన సగం ఎత్తి తాగడానికీ, కప్పు కడిగి అక్కడ పెట్టడానికీ కూడా బద్దకమే. పువ్వులు కొని ఇచ్చేడు తను ఓసారి. "అబ్బా, నాకివి ముడుచుకోడానికి బద్దకం. నువ్వే పెట్టు, బాబూ." అని ఒయ్యారం కురిసింది. అందులో శృంగారం కన బడాలంటే చాలా కాండెసెన్షన్ అవసరం అనిపించింది.

న్యూస్‌పేపరు చదువుతూ, కాఫీ తాగుతూ ఉన్న కమలా మేనోన్ హఠాత్తుగా రెండూ ఆపేసి లేచి కూచుంది. ఒక ఎడ్వర్టైజుమెంటుమీద వేలు పెట్టి "దీనికి నేను ఎప్లయ్ చేస్తాను" అన్నది. గబగబా పెన్నూ నోట్‌బుక్కూ తీసుకుంది. ఆ వివరాలన్నీ రాసేసుకుంది, మరోసారి రాసింది. పేపరులో ఉన్నదీ తైపారువేసి చూసుకొని పేపరులో రెండుసార్లు టిక్ కొట్టింది.

"దొంగముండ! దీని కింకా ఆశ తీర్లేదు. బేకర్ అండ్ బేకర్ మందుల

కంపెనీలో పనీపాటూ లేకుండా షోగ్గా వేనిటీబేగ్ ఆడించుకుని ఇటూ అటు తిరిగినందుకు నెలకి అయిదువందలు పట్టుకుపోతున్నాది. ఇంకా మంచి ఉద్యో గం, ఇంకా ఎక్కువజీతం సంపాదించేద్దామని కాబోలు దీని ఎత్తు" అని విసుగ్గా అసూయగా అనుకున్నాడు సుబ్బారావు.

"సో —గుడ్‌నైట్, సుబ్రావ్!" అని లేచింది కమలా మేనోన్.

"వెళ్ళు. తల్లీ, వేగిరం వెళ్ళు" అని మనస్సులో అనుకొని, "నీకు వెళ దామని బుద్ధిపుట్టింది. ఇంక నే నాగమంటే మాత్రం ఆగుతావా? అదేదో ఉద్యోగానిక్కూడా ఎప్లయ్ చేస్తున్నావు. అదొస్తే మా కంపెనీకే గుడ్‌బైకొట్టేసి వెళ్ళిపోతావు" అన్నాడు సుబ్బారావు.

లేచి నిలబడుతూ గుసగుసమని నవ్వుకుంది కమలామేనోన్. ఒళ్ళంతా కదువుతూ అలా నవ్వుతూఉంటే కొంచెం చిరాగ్గానే ఉంటుందిగాని అప్పు డప్పుడు ఆ నవ్వులో కమలా మేనోన్ని చూడాలనే ఉంటుంది సుబ్బారావుకి.

"ఆ ఎడ్వర్టయిజ్‌మెంటు నువ్వోసారి చూడు, అది నా ఒక్కదానికే కాదు!" అని చిలిపిగా నవ్వుకుంటూ గదీ దాటి వెళ్ళిపోయింది.

యథాలాపంగా ఆ ఎడ్వర్టయిజ్‌మెంటు తీసి చూసేడు సుబ్బారావు, ఇది ఏ కంపెనీదయి ఉంటుందో గెస్ చేషమని, దొరకకుండా వేద్దామనుకుంటారు గాని కొంచెం గట్టిగా ఆలోచిస్తే ఏ కంపెనీ వాళ్ళదో తెలిసిపోతుంది. చూస్తే సరి....

లెంపకాయ కొట్టినట్టయింది హఠాత్తుగా,

అది ఒక "వధువు కావలెను" ప్రకటన!

"చక్కని రూపమూ- మంచి అలవాట్లూ. హుందా అయిన ఉద్యోగమూ గల ఒక ఇరవైయెనిమిదేళ్ళ మలయాళీ యువకునకు కలకత్తాలో కాపరం ఉండ డానికి ఇష్టపడే సౌందర్యవతి అయిన మలయాళీ కన్యకావలెను. వధువునకు ఇంగ్లీషు బాగా తెలియాలి. వయస్సు ఇరవై రెండునుండి ముప్ఫయివరకూ ఉండ వచ్చు. త్వరగా ఫోటోతోసహా దరఖాస్తు పెట్టండి."

మళ్ళీ మళ్ళీ చదివేడు సుబ్బారావు.

కమలా మేనోన్ గడుసుది, తనకి కావలసిన పని మంచిగా జరక్క పోతే మాయోపాయంతోనైనా చేసేసుకుంటుంది. దాంట్లో తనకెప్పుడూ సందేహంలేదు. కాని ఇది ఇన్నాళ్ళూ నామీద కన్నేసిందని భ్రమపడ్డానే,

పేపరులో మలయాళీ యువకుడు— అని కనబడేసరికి నిమిషమేనా నిలబడకుండా ఎగిరిపోయిందే! దీన్ని నే నాకర్షించేననుకొని ఘోరంగా గోతిలో పడ్డానే;— అని తెల్లబోయేడు సుబ్బారావు. ఓపక్క నోటితో "వైడోంట్యు మేరీ—మి—మీ—మీ" అని రోజూ తనని అడుగుతూనే దాని కళ్ళూ, మనస్సూ మలయాళీ యువకుడి కోసం వెతుకుతున్నాయన్న మాట; ఎంత గడుసు దెంత బిరుసు దెంత జాణది!— "దీని కంతకీ కారణం నా ముభావమే. నా తరఫునుంచి దానికి కలుగుతున్న ఆశాభంగమే, నే నెప్పటికప్పుడు దానికి ప్రసాదిస్తున్న నిరుత్సాహమే" అనుకున్నాడు మనస్సులో దైన్యం, పశ్చాత్తాపం నింపుకొని.

అవును, నూటయిరవైయ్యొక్కసార్లు వైడోంట్యూ మేరీ మీ—అని తెగేసి అడిగితే కనీసం ఒక్కసారైనా, కనీసం నన్ను ఆలోచించుకొనీవే అనైనా అన్నాడా? మీరు వేరూ; మేం వేరూ అనే అన్నాడు. "ఇది కాస్మొపొలిటన్ సిటీ. మనం కాస్మిక్ యుగంలో ఉన్నాం. ఇంటర్నేషనల్ రిలేషన్స్ బలపడుతూ ఉంటే ఏమిటి ఈ ఇరుకుసందుల్లాంటి ఆలోచన్లు?" అని దబాయించింది. తను ఎప్పుడూ దానికి ఆశ పుట్టించలేదు. అందుకే అది ఉండీ ఉండీ దానికి కావలసినవాణ్ని వెతుక్కుందికి పోయింది. రేపీపాటికి వాడెవడో కనుక్కొని వాడికి వల పన్ని స్వంతం చేసుకుంటుంది. దాంట్లో సందేహంలేదు.

చేసుకుంటే చేసుకోనీ, పీడ పదిలిపోయింది అని అనుకోడానికి చాలా సేపు పట్టింది సుబ్బారావుకి, ఒక క్షణం ఇలా అనుకుంటే మరుక్షణంలో ఏమిటో దాన్ని చెయిజారిపోనివ్వడం పొరపాటేనేమో అని అనిపించేస్తూంది. దానిలో ఏమీ లేదుగాని ఏదో ఆకర్షణ ఉంది.

ఏమైనాసరే, ఇన్ని ఇంటర్నేషనల్ కబుర్లూ చెప్పి చివరికి అది మలయాళీ వాణ్నే వెతుక్కుంటూ వెళ్ళిపోయిందే! దాంట్లో తను నేర్చుకోవసిన పాఠం ఏమీ లేదా?

ఏమీ లేదా?

లేదా, అని!

సుబ్బారావు కాయితం, కలం తీశాడు. ఆంధ్రప్రదేశంలో బాగా ప్రచారం కలిగి కలకత్తాకూడా వచ్చే ఇంగ్లీషు దినపత్రికలు మూడింటికి ప్రకటనలు వ్రాశాడు.

* * *

"ఏమంటున్నాడు మీ ఫ్రెండు?" అని వేళాకోళం చేసేడు సుబ్బారావు కమలా మేనోన్ని.

"ఫ్రెండెవడు?" అని పేల్చింది కమలా మేనోన్. ప్రతిధ్వని ఇచ్చినంత వేగంగా.

"అదే, ఆ ఎడ్వర్టయిజ్మెంట్ ప్రియుడు."

"ప్రియుడూ లేడు, మొగుడూ లేడు."

"ఎవడూ లేకపోతే ఇన్నాళ్ళూ నా రూమ్కి రాకుండా ఎలా ఊరు కుంటున్నావు!.... ఎటు పోతున్నావు!"

"ఓ!" అని మళ్ళీ ఒళ్ళంతా కదుపుతూ నవ్వింది కమలా మేనోన్, "జెలసీ! దై నేమీజ్ మేన్!.... వాటెపాల్ మైడియర్ కంట్రీమేన్!" అని మరింతసేపు సుబ్బారావుని లక్ష్యపెట్టకుండా నవ్వుకుంది.

"ఇంటర్వ్యూకైనా రమ్మన్నాడా పోనీ!" అని ఛోగట్టా చేసేడు సుబ్బారావు వెటకారం తెలియకుండానే.

"ఆ ఇడియట్—వాడు రమ్మనడం, నేను వెళ్ళడం! వాడెవడో సి.ఐ.ఏ. వాడోయ్. మిస్టర్ సుబ్రావ్!-ట్రివేండ్రమ్ జిల్లాలో అంత దౌర్భాగ్యుడు పుట్ట లేదని మాడాడీ కామెంట్ చేసేడు!"

"ఓ!"

సుబ్బారావు కింకా తనివి తీర్లేదు.

"శృంగభంగమైంది దొండముండకి! దీని కింతే కావాలి" అనుకున్నాడు. రూమ్కి తీసుకువెళ్ళి దీనిచేత ఇంటర్నేషనల్, కాస్మో పాలిటిన్, కాస్మిక్ కబుర్లు చెప్పించి, లెక్చర్లిప్పించి, "ఏం పిల్లా, మరి మలయాళీ యువకుడు అని చదవగానే గజ్జెలగుర్రంలా పారిపోయావే" అని వెక్కిరించాలి. అప్పుడు తన కసి తీరాలి.

"మరవుతే మా రూమ్కి రా: పార్టీ ఇస్తాను."

"ఎందుకు పార్టీ?"

"ఇంకా నయం? గండం గడిచినందుకు నువ్వియ్యవలసింది పార్టీ. పద, పద;" ఎప్పుడోగాని చెయ్యని పని; నడుంమీద చెయ్యేసి లాక్కుపోయాడు.

తిన్నగా లోపలికి వెళ్ళిపోయి స్టవ్ వెలిగించి నీళ్ళు పెట్టి అవతలికి వచ్చాడు సుబ్బారావు.

నిలబడి ఉండే లెటర్ స్లిప్‌లోంచి పడ్డ పెద్ద కవరుని అటూ ఇటూ తిప్పి పరీక్ష చేస్తూంది కమలా మేనోన్.

"ఏమిటది?" అన్నాడు సుబ్బారావు హుషారుగా.

"చూడు" అన్నట్టు కళ్ళలో మెరుగు పెట్టుకొని చేతి కందించింది.

అది ఒక దినపత్రికవాళ్ళు పంపిన కవరు. పైన వ్రాసి ఉంది; ఫలానా అడ్వర్‌టైజ్‌మెంటు నెంబరుకి జవాబుగా వచ్చిన మెయిల్, ఫలానా పత్రికవారి అభినందనలతో.

దొంగతనంగా కమలా మేనోన్‌వేపు చూశాడు సుబ్బారావు.

దొంగతనం ఎప్పుడో పసికట్టేసింది కమలా మేనోన్.

కళ్ళలో చిరునవ్వు నోటిమీదికి రాకుండా జాగ్రత్త పడుతూ కమలా మేనోన్ ఖాళీగా వదిలిపెట్టిన మంచంమీద కూర్చుంటూ కవరు తెరిచాడు సుబ్బారావు.

"జస్ట్ వన్ మినిట్. ఆ కుర్చీ తెచ్చుకుని కూర్చో. ఇదేం కాన్ఫిడెన్షల్ గాదు. నీకంతా చెబుతాగా!"

లోపల ఒకటే ఒక కవరు ఉంది.

అంతే!

"తను మూడు ఆంగ్ల దినపత్రికలకి అడ్వర్టయిజ్‌మెంటు పంపిస్తే. ముక్కోటి ఆంధ్రులు—కాదు, అయిదు కోట్లట ఆంధ్రుల జనాభా—అంత మంది చదివితే ఒక్కటా. తనని వివాహం చేసుకోడానికి ఇష్టపడి సిద్ధపడుతూ వచ్చిన కన్య దరఖాస్తు. నేనూ, నా స్థితీ ఒక్క కన్యనికంటె ఆకర్షించలేక పోయానా." అని చిన్నబుచ్చుకున్నాడు సుబ్బారావు.

నాన్నగారు చెప్పిందీ నిజమేనేమో!

కలకత్తాలో కాపురం అనేసరికి కామేశ్వరావుగారి ఇందిరా, వీరభద్రయ్య గారి గిరిజా ఇద్దరూ వద్దన్నారుట. అసలా పెళ్ళిళ్ళ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు సంబంధాలు నేను చూడ లేనండీ అన్నది కూడా ఇందుకేట!

నిన్ననే మిగిలిన రెండు పత్రికల వాళ్ళూ రాసిన ఉత్తరాలు వచ్చేయి మీ "ఏడ్"కి జవాబుగా ఒక్క అప్లికేషనూ రానట్లు తెలియజేయడానికి చింతిస్తున్నాము అంటూనూ,

ఈ ఒకటే?

ఇది ఎవతె?

కమలా మేనోన్ కళ్ళలోకి బ్లాంక్‌గా చూశాడు సుబ్బారావు. చిలిపిగా నవ్వుతూంది....కొంపదీసి ఈ ఒక్క అప్లికేషనూ దీనిది కాదుగద!

మే గాడ్ ఫర్‌బిడ్?

"కవరు విప్పు! ఏమిటలా తెల్లబోయి చూస్తావు" అన్నట్టు కుతూహలం కళ్ళలో కనబరుస్తూ, "ఏదీ ఇలా తే! నేను ఓపెన్ చేస్తాను!" అన్నట్టు చెయ్యి జాపింది కమలా మేనోన్.

"ఉండుండు."

విప్పి చూసేడు సుబ్బారావు.

స్థాణువైపోయేడు.

గదీ, మంచం, చేతిలో కవరూ, కమలా మేనోన్, అన్నీ. అందరూ గిరగిరా తిరుగుతున్నాయి. నేనూ తిరిగిపోతున్నాను.

నాకు తెలివి తప్పిపోతున్నాది.

పై నున్న పంకా పడిపోతుంది నామీద.

నేనెంతో దుష్టుణ్ని, చస్తాను. కుళ్ళి కుళ్ళి చస్తాను,

ఇప్పుడు నా అంత్యకాలం సమీపించింది. ఎంత ఘోరమైన పాపం!

ఈ అక్షరాలు....

ఇది ఒక లేఖరూపం దాల్చిన మానవజాతి మరణశాసనం,

దీనికి నేను పురోహితుణ్ని.

ఇది మహా పాపం.

"అయ్యా,

నా పేరు వసంత. మా నాన్నగారి పేరు కె. వీరభద్రరావు నేను స్కూలు పైనలు పాసయి ఉన్నాను. ఇందులో నా ఫోటోను పంపినాను. నా వయస్సు ఇరవైనాలుగు సంవత్సరాలు. కట్నాలు ఇచ్చుకోలేక మా వాళ్ళు ఇన్నాళ్ళవరకు నా పెళ్ళి చెయ్యలేకపోయినారు. నేను కలకత్తాలో కాపురం చేయడానికి ఇష్టపడు తున్నాను. అక్కడ మా అన్నయ్య పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు.మా అన్నయ్య చాలా మంచివాడు. నాకూ, మా చెల్లెలికీ పెళ్లిళ్ళు కాలేదనీ తన పెళ్ళి వాయిదా వేసుకుంటున్నాడు. క్రింద అతని ఎడ్రసు కూడా వ్రాసినాను. తమరు త్వరగా సంప్రదింపులు జరిపినట్లయితే మాకు నిరీక్షణ బాధ తప్పుతుంది.

వై డోంట్యూ మేరీ మీ? —కె. వసంత."

"ఎందుకలా వణికిపోతున్నావ్, సుబ్రావ్!" కమలా మేనోన్ కూర్చుని అడిగింది;

జవాబు లేదు.

లేచి నిలబడి అడిగింది.

ఊఁహూఁ.

"ఏదో ఇమోషనల్ షాక్ వచ్చినట్లుంది. పూర్ ఫెలో. ఒళ్ళంతా చెమ టలు పోసేస్తున్నాయి," ఫేన్ పూర్తిస్పీడ్‌లో తిరిగేటట్లు ఆన్ చేసింది కమలా మేనోన్.

"ఐ హేవ్ నో టియర్స్ టు షెడ్."

"ఏమిటి, సుబ్రావ్!"

"నా పాపానికి నిష్కృతిలేదు" అన్నాడు సుబ్బారావు కళ్ళు తేలిగ్గా ఒత్తు కుంటూ, "వాళ్ళకి నామీద ఉండే సదభిప్రాయానికి నేను చేసే నిరవాకం ఇదా?"

"అసలేమిటుంది, సుబ్రావ్, అందులో ? ఎందుకు నువ్వలా అయిపోతు న్నావ్ ?"

చేతిలో ఫోటో, ఉత్తరం పరుపుమీద పడేశాడు సుబ్బారావు. "మాచెల్లెలు .... అప్లికేషన్ ...." గొణుగుతూ రెండు చేతులూ మొహంమీద కప్పుకున్నాడు.

అప్లికేషన్లు ఇంగ్లీషులోనే ఉంటాయి.

కమలా మేనోన్ జరిగిందేమిటో గ్రహించి, పరిస్థితి అదుపులో ఉంచు కున్నట్టే కనబడిందిగానీ సగం పైగా షాక్ తనూ తిన్నది.

ఈ ఉదంతంలోని అవమానం దేశ కాల పరిస్థితులేవైనాసరే—ఎవరికేనా ఒక్కలాటిదే.

వెంటనే లోపలికి వెళ్ళిపోయింది.

స్టవ్‌మీద నీళ్ళు మరుగుతున్నాయి.

"పూర్ ఫెలో!" అనుకున్నది కమలా మేనోన్.

రెండు నిమిషాల్లో కాఫీకప్పులతో ఇవతలికి వచ్చింది. సుబ్బారావు దిగాలు పడి ఉన్నాడు.... కాఫీ అందుకొనేటట్లు చెయ్యడమే కష్టమైపోయింది.

"నయం ! నే నివాళ రాకపోతే ఏమై ఉండేదో!" అనుకుంది కమలా మేనోన్, గ్రీకు ట్రాజెడీలు ఆమె మనసులో వికారంగా కదలాడి భయంకరమైన ప్రమాదాల్ని ఊహించాయి.

"ఎంత కష్టం! ఎంతవిషాదగాథ! ఎటువంటి షాక్స్ ఇస్తుంది మన సాంఘిక వ్యవస్థ!" అని ఓదార్పు మాటలు చెప్పి అతని కష్టంలో పాలు పంచు కుంది కమలా మేనోన్.

("వై డోంట్యు మేరీ మీ ?" అని ఈ మాటు సుబ్బారావు కమలా మేనోన్ని అడిగాడు.)